క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

అయిజ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రంకు మున్సిపల్ ఉద్యోగి ఆనంద్ శుక్రవారం పుస్తకాలు వితరణ చేశారు. పోటీ పరీక్షల కోసం సంబంధించి ఉపయోగంగా ఉంటుందని పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక

అయిజ: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎం.ప్రభాకర్ ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ చేతుల మీదుగా శాంతినగర్‌లో శుక్రవారం నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని పేర్కొన్నారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి

రాజోళి: వర్షాకాల సీజన్ కావడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మరియమ్మ సూచించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తుండటంతో పాటు అక్కడక్కడా ఉరుములు, మెరుపులు ఉన్నాయని, రైతులు పొలాల వద్దకు వెళ్తున్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్ల కింద ఉండొద్దని, వీలైనంత వరకు వాటి నుంచి దూరంగా ఉండేలా ప్రయత్నించాలని అన్నారు. విత్తనాలు వేసే రైతులు కూడా సరైన విత్తనాలు తీసుకుని, బిల్లులు వద్ద ఉంచుకోవాలని, మోసం చేసే వ్యాపారులు, దళారులను నమ్మొద్దని సూచించారు.

ముళ్లపొదల తొలగింపు



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని 6వ వార్డులో శుక్రవారం ముళ్లపొదలు తొలగించే కార్యక్రమాన్ని సిబ్బంది చేపట్టారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా వంక కాలువ నుంచి గొల్ల గట్టు వరకు దట్టంగా పెరిగిన ముళ్లపొదలను జేసీబీతో తొలగించి కాల్వను శుభ్రం చేశారు. వర్షాకాలంలో వర్షపు నీటికి ఆటంకం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు సిబ్బంది వివరించారు.

బైక్ చోరీ: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్‌చౌరస్తాలో గురువారం ఇంటి వద్ద నిలిపిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. యజమాని గజేంద్ర శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. మానవపాడు మండలంలోని జల్లాపురం చెందిన చిన్నారెడ్డి స్వగ్రామం నుంచి తన బైక్‌పై పని నిమిత్తం పెబ్బేరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై బీచుపల్లి విజయ ఆయిల్ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో ఆయన ఒక్కసారిగా నడి రోడ్డుపై పడిపోయాడు. అదే దారిలో వెళ్తున్న లారీ అతని రెండు కాళ్లపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత

మానవపాడు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురు ఇటీవల పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌లను రికవరీ చేసి తిరిగి వారికి అందించినట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ శుక్రవారం తెలిపారు. ఎవరైన ఫోన్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి అందజేస్తామన్నారు.

వలంటీర్ల నియామకం జరిగేనా?

- ప్రభుత్వ పాఠశాలల్లో భారీగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు
- ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయుడితో విద్యాబోధన
- ఐదు తరగతులకు ఇద్దరు నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు
- ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లతో చదువులు అటకెక్కే అవకాశం



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విద్యావలంటీర్ (ఫైల్)

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో చదువులు అటకెక్కుతున్నాయి. రెండు నుంచి మూడు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో ఎవరికి ఏమి నేర్పాలో, ఏమి నేర్చుకుంటున్నారో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వమేమో బడిబాట కార్యక్రమం చేపట్టి బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశిస్తున్నారే తప్ప పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి మౌలిక వసతులు కల్పించాలనే ఆలోచన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. గతంలో వలంటీర్లను నియమించి కొంత వరకు విద్యావ్యవస్థను గాడిలో పెట్టారని, బడిబాటలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రయత్నం చేస్తున్నారే తప్ప వారికి విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలనే ఆలోచన ఎందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేవరకు వలంటీర్లను నియమించి (రెన్యూవల్ చేసి) విద్యాబోధన గాడినపడేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉచితాల గురించే..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని ఉచితంగా అందజేస్తామని చెబుతున్నారేగాని విద్యాబోధన సరిగాలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఏ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నారో ఉన్నతాధికారులే చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కూలీనాలీ చేసుకుని బ్రతికే వారు కూడా రూ.వేలు ఫీజులు కట్టి, బస్సులకు పైసలు కట్టి ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను ఎందుకు పంపుతున్నామో ప్రభుత్వం గుర్తించాలని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం పెడుతున్నారేగాని పిల్లల సంఖ్యకు తగ్గట్టుగా పంతుళ్లను నియమించకుండా చదువులు మాత్రం అటకెక్కిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

మూడేళ్లుగా నియమించని పరిస్థితి

మూడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యావలంటీర్లను అప్పటి ప్రభుత్వం నియమించింది. కరోనా సమయంలో తొలగించారు. ఇప్పటివరకు నియమించకపోవడం, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో రెండు మూడు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితులు నియోజకవర్గంలో నెలకొన్నాయి.

బదిలీలు, ప్రమోషన్లతో..

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లను ప్రభుత్వం చేపడుతున్నామని చెబుతుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివించే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అరకొరగా ఉన్న ఉపాధ్యాయులను ప్రమోషన్లు, బదిలీలు చేపడితే చదువులు అటకెక్కుతాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పదవివిరమణ పొందడంతో..

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో చాలా మంది ఉపాధ్యాయులు పదవి విరమణ పొందారు. వారందరు పనిచేసే స్థానాలు ఖాళీలు ఏర్పడ్డాయి. అంతేగాక గతంలో ఉన్న ఖాళీలు, బదిలీలు, ప్రమోషన్లు చేపడితే ఏర్పడే ఖాళీలతో చదువులు దెబ్బతినే ప్రమాదం ఉందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు ఎలా పంపేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి కొత్త ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసే వరకు కనీసం వలంటీర్ల నియమకం చేపట్టి నిరుపేద విద్యార్థులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

చదువులు సరిగా లేవు..



ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు బాగా చెబితే ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను ఎందుకు పంపుతాం. నేను ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రూ.వేలు ఫీజులు, బస్సు చార్జీలు చెల్లించి ఆర్థిక ఇబ్బందులకు ఎందుకు గురవుతాం. ఉచితంగా పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం పెడతామని చెబుతారేగాని ఉపాధ్యాయులను నియమించకుండా చదువులు మాత్రం చెప్పడం లేదు. – కేశవులు, యాపదిన్నె

మూడేళ్లుగా ఖాళీగానే..



బీఈడీ చేసిన వాళ్లమంతా మూడేళ్లుగా ఖాళీగా ఉన్నాం. అటు డీఎస్సీ వేసి పోస్టులు భర్తీ చేయరు. ఇటు వలంటీర్లను నియమించరు. గతంలో ప్రభుత్వ పాఠశాలలో వలంటీర్‌గా పనిచేశాను. కరోనా సమయంలో తొలగించారు. అప్పటి నుంచి ఉపాధిలేక ఖాళీగా ఉన్నా. వలంటీర్ పోస్టులను రెన్యూవల్ చేస్తే ఉపాధ్యాయ పోస్టులు నియామకం చేపట్టే దాకా చదువులు చెబుతాము, మాకు ఉపాధి లభిస్తుంది. – మనోజ్‌కుమార్, జక్కిరెడ్డిపల్లి, వడ్డేపల్లి మండలం

కూలీకి వెళ్తున్నా..



నాలుగేళ్లుగా కూలీ పనులకు వెళ్తున్నాను. హిందీ పండిట్ చదివాను. గతంలో తుపత్రాలలో రెండేళ్లు వలంటీర్‌గా పని చేశాను. కరోనా సమయంలో తొలగించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నా మమ్మల్ని తొలగించడం ఎంత వరకు సమంజసం. కొత్త ఉపాధ్యాయులను కేటాయించేదాకా మమ్మల్ని వలంటీర్లుగానైనా నియమించుకొని ఉపాధి కల్పించాలి. – రాజు, తుపత్రాల

ఆదేశాలు రాలేదు



డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. వలంటీర్ల పోస్టులు భర్తీ గురించి ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. – నర్సింహ, ఎంఈఓ, వడ్డేపల్లి మండలం

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ



ధరూరులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ధరూరు: మండలంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఏఓ జనార్దన్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి పలు దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, మందులను, విత్తనాలను అందించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, నాణ్యత లేని వాటిని రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యజమానులకు హెచ్చరించారు.

కరాటేతో ఆత్మరక్షణ



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

గద్వాల అర్బన్: ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని డీడబ్ల్యూఓ సుధారాణి, ఎస్‌ఐ రాములు అన్నారు. ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. ఉచిత శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, బ్లాక్ బెల్ట్ శ్రీహరి, వరలక్ష్మీదేవి, గిరిబాబు, శ్రీనివాసులు, విజయ్, ఆనంద్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

అయిజ: తాయిక్వాండో సమ్మర్ కోచింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాస్టర్‌లు సర్టిఫికెట్‌లు అందజేశారు. మాస్టర్ మధుకుమార్ మాటాల్డుతూ.. తాయిక్వాండో వేసవి శిక్షణలో భాగంగా మే 1 నుంచి 31వరకు శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్టర్లు మధుకుమార్, శ్రీవలి ఆచారి, సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫామ్స్ అందజేత



ధరూరులో యూనిఫామ్స్ అందజేస్తున్న ఎంఈఓ

ధరూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం తయారు చేసిన యూనిఫాంలను శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మార్సీలో ఎంఈఓ సురేష్ వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాంలను అందజేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాంలను కుట్టించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, సీసీలు నవీన్‌కుమార్, శేఖర్, జయరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

కేటీదొడ్డి: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంవీఎఫ్ ఫౌండేషన్ మండల కన్వీనర్ కిరణ్ అన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలోని భాగంగా మండలంలోని గువ్వలదిన్నెలోని ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శ్రీపాదరెడ్డి, వెంకటేష్‌గౌడ్, ఎంవీఎఫ్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రాయితీ పరికరాలేవి?

- కనుమరుగవుతున్న సబ్సిడీ పథకాలు
- ప్రతి ఏటా తగ్గుతున్న వైనం
- పెరుగుతున్న సాగు ఖర్చులు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- నియోజకవర్గంలో 88,824 మంది రైతులు



సాసనూలులో ఎద్దులతో అచ్చుకొడుతున్న రైతులు

ఆయా మండలాల వారిగా ఉన్న రైతులు..

మండలం	రైతులు
ఇటిక్యాల	18,126
మానవపాడు	10,175
ఉండవెల్లి	10,717
అలంపూర్	9,519
రాజోలి	9,971
వడ్డేపల్లి	9,657
అయిజ	20,659

ఎర్రవల్లిచౌరస్తా: ఆధునిక వ్యవసాయం రోజు రోజుకు ప్రశ్నార్థకంగా మారుతోంది. వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో రైతులకు చేరడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చడం లేదు. వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి. దీంతో రైతన్నల ఆశలపై నీళ్లు చల్లుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకాల మంజూరును గత ప్రభుత్వం పక్కన పెట్టడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో సబ్సిడీలో నూతన ప్రభుత్వం అందజేసే యంత్రాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

అందని ద్రాక్షలా రాయితీ పనిముట్లు..

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా, మొత్తం 124 గ్రామ పంచాయతీలు కలవు. దీనిలో మొత్తం 88,824 మంది రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే పథకాలు, సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం ప్రతి ఏటా అందించేది. దీనిలో భాగంగా రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు, నాగళ్లతో పాటు తదితర వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు నేరుగా పంపిణీ చేసేది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రాయితీపై అందజేసే పనిముట్లు అందని ద్రాక్షలా మారడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రతి ఏటా నిలిచిపోతున్న పథకాలు..

వ్యవసాయ రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా 2006–07 నుంచి నిలిచిపోయాయి. సేద్యంలో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014లోనే నిలిచిపోయాయి. ఈ కారణంగా పంట పొలాల్లో ఎద్దులతో పనిచేయాలంటే నిత్యం ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల వ్యవసాయ పనిముట్లు ఆ తరువాత పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో అన్నదాతలకు అత్యవసరమైన వ్యవసాయ పరికరాలు రాయితీలపై అందకుండా పోతున్నాయి. దీనివల్ల తప్పనిసరి పరిస్థితుల్లో రెట్టింపు ఖర్చు చేసి రైతులు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రావాల్సిన సబ్సిడీ పరికరాల విషయంపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతేడాది కొంత మేరకు వచ్చిన పరికరాలను రైతులకు సబ్సిడీ ద్వారా నేరుగా అందజేశాం. రైతుల సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి ఏవైనా పరికరాలు, యంత్రాలు వస్తే రైతులకు సమాచారం అందించి సబ్సిడీపై పంపిణీ చేస్తాం. – సక్రియనాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు, అలంపూర్

గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



సూచనలిస్తున్న డాక్టర్ ప్రసూనరాణి

అలంపూర రూరల్: గర్భిణులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి ప్రసూనరాణి అన్నారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష ఏర్పాటు చేశారు. తీసుకునే ఆహారం ద్వార రక్తహీనత నుంచి బయట పడవచ్చని వివరించారు. పరిసర ప్రాంతాలలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఒక వేళ పరిసరాలలో నీటి నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికెన్‌గున్య, మెదడు వాపు తదితర రోగాలు ప్రబలుతాయని తెలిపారు. గర్భిణులు కాన్పు అయ్యేలోపు 9కేజీల నుండి 10 కేజీల వరకు బరువు పెరగాలని సూచించారు. ధనుర్వాతం రాకుండా టీటీ టీకాలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత రాకుండా ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు విధిగా 100 తీసుకోవాలని తెలిపారు. ప్రతి గర్భిణి 9 నెలలు పూర్తయిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజల పక్షాన పోరాటం



గట్టులో మాట్లాడుతున్న వెంకటస్వామి

గట్టు: ప్రజల పక్షాన పోరాటం చేసేది ఎర్రజెండానే అని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను మండల కేంద్రంలో నిర్వహించారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులపై నిరంతరం వారి పక్షాన నిలబడి సీపీఎం పార్టీ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఎర్ర జెండాను ప్రతి పల్లెకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఇప్పటికే దేశంలో, రాష్ట్రంలో ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు ఎన్నో ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తున్నారని, ఇప్పటికి దేశంలో 40 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలు లేక చాలా మంది పట్టణాలకు వలస వెళుతున్నట్లు తెలిపారు. రైతులు గిట్టుబాటు ధరలు రాక, పెట్టుబడులు భారమై అప్పుల ఊబిలో కూరుకు పోతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల పేరుతో దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచి పెడుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో నర్సింహ, రాజు, నర్మద, ఆంజనేయులు, ఉరుకుందు, నారాయణ, నర్సింహులు, శివప్ప, నాగార్జున, స్వామి, సవారి, సామేలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో విక్రయాలు నిలిపివేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా

అయిజ: ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, షూ తదితర వస్తువులు విక్రయించడాన్ని నిలిపివేయాలని, అధిక ఫీజు దోపిడిని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నాయకుల సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు నడుచుకుంటున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, యూనిఫాం, పుస్తకాలు, టై, బెల్ట్, షూల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులనుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారని అన్నారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలను మూసివేయాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుమల్, సురేందర్, శివ పాల్గొన్నారు.

శరవేగంగా బ్రిడ్జి పనులు



ముండ్లదిన్నె–కొంకల మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి

రాజోళి: మండలంలో పలు గ్రామాల మీదుగా ఆరు లైన్ల రహదారి వెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మండలంలోని ముండ్లదిన్నె–కొంకల మధ్యలో కూడా ఆరులైన్ల రహదారి వేస్తున్నారు. ఈ గ్రామాల మధ్యలో బ్రిడ్జి నిర్మిస్తుండగా.. దాని పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పనులు చివరి దశకు చేరుకోగా, వాహనదారులకు అంతరాయం కలగకుండా పక్కన రోడ్డు ఏర్పాటు చేశారు. రహదారి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని, పలు చోట్ల బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి అయ్యాయని, కాకపోతే ఆ రహదారి గుండా ప్రయాణించేందుకు మండల వాసులకు ఎక్కడ ప్రవేశం కల్పించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దుకాణ యజమానిని నమ్మించి మోసం

శాంతినగర్: కిరాణా దుకాణంలో నమ్మించి యజమాని వద్దే డబ్బులు తీసుకెళ్లిన ఉదంతం శాంతినగర్లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిపై రాఘవేంద్ర కిరాణ దుకాణానికి మధ్యాహ్నం ఓ యువకుడు సరుకుల కోసం వచ్చాడు. వారి ఇంట్లో ఫంక్షన్ ఉందని సరుకులు ఎక్కువగా కావాలని లిస్ట్ ఇచ్చి సరుకులు కటించాడు. చికెన్ సెంటర్‌కు వెళ్లి చికెన్ తీసుకురావాలని, మా నాన్న మొత్తం డబ్బులు ఫోన్ పే చేస్తాడని, చికెన్‌కు అవసరమైన రూ.5,500 నగదు ఇవ్వాలని దుకాణ యజమాని రాఘవేందర్‌రావును కోరాడు. యువకుడి మాటలు నమ్మిన యజమాని నగదు ఇచ్చాడు. సాయంత్రం వరకు యువకుడు రాకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని మోసపోయానని గ్రహించి శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. కాగా ఈ దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు అయ్యాయి.

ఇంకుడుగుంతలపై దృష్టి సారించండి



సింగంపేటలో పాటు కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

అమరచింత: వర్షాకాలంలో వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో ఇంకుడుగుంతలను నిర్మించాలని, ఇందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సింగంపేటలో జరుగుతున్న పాటు కాల్వలో పూడికతీత పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద ఇంకుడుగుంతల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పెద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపంగా..

పాన్‌గల్: మండల కేంద్రంలోని వైన్ షాపు సమీపంలో ఉన్న మురుగు కాల్వలో చెత్త, చెదారం చేరడంతో జమ్ము మొలిచి దుర్వాసన వెదజల్లుతుందని, వాటి తొలగించి కాల్వను శుభ్రం చేశామని ఉపాధి కూలీలు పేర్కొన్నారు. గ్రామం నుంచి వచ్చే మురుగు, వర్షపు పాటు నీరు మొత్తం ఇదే కాల్వ గుండా ప్రవహించాలి. చెత్త, చెదారం, జమ్ముతో నిండింది. దీంతో ఉపాధి కూలీలను పెట్టి ఆ కాల్వను శుభ్రం చేయించారు. దుర్వాసన వస్తున్న కాల్వను శుభ్రం చేసిన ఉపాధి కూలీలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.